# ధరణి లోపాలతో రైతులు ఇబ్బందులు పడ్డారు

- మంత్రి పొంగులేటి
- సత్తుపల్లి ప్రజా దర్బార్లో గత ప్రభుత్వంపై విమర్శలు
- అర్హులందరికీ ఇందిరమ్మ ఇల్లు హామీ



**ఉద్యమ కెరటం, సత్తుపల్లి:** గత ప్రభుత్వ అనాలోచిత నిర్ణయాలు, ధరణి పోర్టల్లోని లోపాల కారణంగా పేదలు, రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని తెలంగాణ రెవెన్యూ, గృహనిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి విమర్శించారు. భూ రికార్డులను పేదల చేతుల్లోకి తీసుకువచ్చి అర్హులైన ప్రతి రైతుకు హక్కులు కల్పిస్తామని హామీ ఇచ్చారు. గురువారం సత్తుపల్లిలోని ఎంఆర్ గార్డెన్స్లో స్థానిక ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్ ఆధ్వర్యంలో పెనుబల్లి, వేంసూరు, సత్తుపల్లి మండలాలకు సంబంధించిన "ప్రజా పాలన–ప్రగతి ప్రణాళిక.. ప్రజా దర్బార్" కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న మంత్రి ప్రజల నుంచి నేరుగా వినతులు స్వీకరించి సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ గత పాలకులు తెలంగాణను రూ.8.18 లక్షల కోట్ల అప్పుల్లోకి నెట్టారని ఆరోపించారు. అయినప్పటికీ సంక్షేమ పథకాల అమలులో తమ ప్రభుత్వం వెనుకడుగు వేయదన్నారు. గత ప్రభుత్వంలో ఇళ్ల పేరుతో కేవలం హామీలకే పరిమితమయ్యారని, తమ ప్రభుత్వం మాత్రం తొలి ఏడాదిలోనే రూ.22,500 కోట్లతో నాలుగున్నర లక్షల ఇళ్లను మంజూరు చేసిందని తెలిపారు. ఇప్పటికే 1.25 లక్షల ఇళ్లు పూర్తయ్యాయని, జూన్ నాటికి మరో లక్ష ఇళ్లు సిద్ధమవుతాయని చెప్పారు. జూన్ 2న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా రాష్ట్ర వ్యాప్తంగా రెండో విడత ఇందిరమ్మ ఇళ్ల పంపిణీ ప్రారంభమవుతుందని వివరించారు. లబ్ధిదారుల ఖాతాల్లోకి ప్రతి సోమవారం నేరుగా నిధులు జమ చేస్తున్నామని, ఎలాంటి లంచాలకు తావు లేదని స్పష్టం చేశారు. ఇళ్ల నిర్మాణానికి ములకలపల్లి క్వారీ నుంచి ఉచితంగా నాణ్యమైన ఇసుక అందిస్తామని పేర్కొన్నారు. గత ప్రభుత్వంలో నిరుద్యోగులను నిర్లక్ష్యం చేశారని విమర్శించిన మంత్రి, తమ ప్రభుత్వం రెండేళ్లలోనే 72వేల ఉద్యోగాలు భర్తీ చేసిందని, త్వరలో మరో ఉద్యోగ ప్రకటన విడుదల చేస్తామని తెలిపారు. సత్తుపల్లి పరిధిలోని సర్వే నం.399తో పాటు పేదపల్లి, నారాయణపురం ప్రాంతాల్లో ఉన్న దాదాపు 6,500 ఎకరాల భూమి సమస్యలపై స్పందించిన మంత్రి, అర్హులైన రైతులకు పట్టాదారు పాస్ పుస్తకాలు అందించాలని, పహానీల్లో పేర్లు నమోదు చేయాలని అధికారులను ఆదేశించారు. భూ సర్వే ప్రక్రియను వేగంగా పూర్తి చేయాలని సూచించారు. రుద్రాక్షపల్లి, కొకపాడు, తాళపెంట, రామచంద్రాపురం, వెంకటగిరి తదితర గ్రామాల్లో నెలకొన్న అటవీ–రెవెన్యూ భూముల వివాదాలపై కూడా స్పందించారు. వర్షాకాలానికి ముందే సరిహద్దుల కొలతలు పూర్తి చేసి తరతరాలుగా సాగు చేస్తున్న పేదలకు పట్టాలు అందజేస్తామని హామీ ఇచ్చారు. అటవీ హక్కుల చట్టం ప్రకారం పట్టాలు పొందిన రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలిగించవద్దని అటవీ శాఖ అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్, ఐడీసీ చైర్మన్ మువ్వ విజయబాబు, సత్తుపల్లి, కల్లూరు మున్సిపల్ కమిషనర్లు, వేంసూరు, పెనుబల్లి మండలాల తహశీల్దార్లు, ఎంపీడీఓలు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# తెలంగాణ ఆత్మగౌరవాన్ని రక్షించుకోవడమే లక్ష్యం



**ఉద్యమ కెరటం, నేరడిగొండ:** తెలంగాణ ఆత్మగౌరవాన్ని, ఉద్యమ స్ఫూర్తిని రక్షించుకోవడమే లక్ష్యంగా తెలంగాణ రక్షణ సేన ముందుకు సాగుతోందని బోథ్ నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే రాథోడ్ బాపూరావు అన్నారు. తెలంగాణ రక్షణ సేన అధినేత్రి కల్వకుంట్ల కవిత ఆదేశాల మేరకు రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించిన 'జెండా పండగ'కార్యక్రమంలో భాగంగా గురువారం బోథ్ నియోజకవర్గంలో పార్టీ శ్రేణులు ఉత్సాహంగా జెండా ఆవిష్కరణ వేడుకలు నిర్వహించారు. నేరడిగొండ మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన ఈ వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పార్టీ కార్యకర్తల్లో నూతన ఉత్సాహాన్ని నింపేందుకే ఈ జెండా పండగను ఘనంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ ఉత్సవాల సందర్భంగా బోథ్ నియోజకవర్గంలోని గల్లీలు, తండాలు, గూడాలు పార్టీ జెండాలు, రంగురంగుల తోరణాలతో కళకళలాడాయి. కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని తెలంగాణ అమరవీరులకు ఘన నివాళులు అర్పించారు. జెండా ఆవిష్కరణ అనంతరం పార్టీ శ్రేణులు నినాదాలతో హోరెత్తించడంతో ప్రాంతమంతా పండుగ వాతావరణం నెలకొంది. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఘనంగా రాజీవ్ గాంధీ వర్ధంతి వేడుకలు

- పేషంట్లు, ప్రయాణికులకు పండ్లు, మజ్జిగ, నిమ్మరసం పంపిణీ



**ఉద్యమ కెరటం, తాండూర్:** మాజీ ప్రధాని, భారతరత్న స్వర్గీయ రాజీవ్ గాంధీ వర్ధంతి వేడుకలను గురువారం తాండూర్ మండల కేంద్రంలోని ఐబీలో మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తాండూర్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పెద్దబోయిన శంకర్ రాజీవ్ గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాజీవ్ గాంధీ దేశ అభివృద్ధి, యువత సంక్షేమం కోసం చేసిన సేవలు చిరస్మరణీయమని కొనియాడారు. ఆయన ఆశయ సాధనకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగులకు అరటి పండ్లు, మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేశారు. అలాగే ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణిస్తున్న ప్రయాణికులకు అరటిపండ్లు, నిమ్మరసం అందజేసి సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మంచిర్యాల జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు ఎస్.రవీందర్ రెడ్డి, గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ సాల్వాజి మహేందర్ రావు, మాజీ జెడ్పీటీసీ సాలిగామ బానయ్య, నాయకులు టి.శంకర్ గౌడ్, శ్రీనివాస్, సూరం దామోదర్ రెడ్డి, మాస వెంకటస్వామి, తాండూర్ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు దేగ స్వామి, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# పేదలకు ఉపాధి దూరం చేసే కుట్రలు

- వ్యవసాయ కార్మిక సంఘం జెండా ఆవిష్కరణ



**ఉద్యమ కెరటం, తాండూర్:** ఉపాధిహామీ పథకం ద్వారా పేదలకు ఉపాధి కల్పిస్తున్నప్పటికీ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం నిధులను 60 శాతం వరకు తగ్గించి ఐటెస్ట్, ఆన్లైన్ విధానాల పేరుతో పేదలను ఉపాధికి దూరం చేసే కుట్ర చేస్తుందని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కనికారపు అశోక్ అన్నారు. తాండూర్ మండల వ్యవసాయ కార్మిక సంఘం ప్రథమ మహాసభ సందర్భంగా గురువారం మండల కేంద్రంలోని భగత్సింగ్ కమిటీ హాల్లో తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జెండాను ఆవిష్కరించారు. మహాసభకు దాగం రాజారాం అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దేశంలోని కోట్లాది పేదలు తమ కష్టార్జిత శ్రమపై ఆధారపడి జీవిస్తున్నారని అన్నారు. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పేరును మార్చి కొత్త పేరుతో అమలు చేయడాన్ని వ్యతిరేకిస్తూ పాత పేరునే కొనసాగించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల సమయంలో హామీ ఇచ్చిన విధంగా పేద మహిళలకు రూ.2500 ఆర్థిక సహాయం ఇప్పటికీ అమలు చేయలేదని విమర్శించారు. చేతివృత్తిదారుల రాష్ట్ర నాయకులు పైళ్ల ఆశయ్య మాట్లాడుతూ పోడు భూముల్లో సాగు చేస్తున్న పేదలపై అటవీ శాఖ అధికారులు వేధింపులకు పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే ఆ భూములకు పట్టాలు ఇచ్చి ఎలాంటి వేధింపులు లేకుండా చూడాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు గోమాస అ శోక్, ఎస్ఎఫ్ఐ జిల్లా కన్వీనర్ దాగం శ్రీకాంత్, మండల అధ్యక్షులు వేల్పుల శంకర్, కార్యదర్శి కొమ్మ కేతా, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# నర్సాపూర్ గ్రామంలో వైద్య శిబిరం



**ఉద్యమ కెరటం, తాండూర్:** ప్రజాపాలన– ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా తాండూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో గురువారం నర్సాపూర్ గ్రామంలో వైద్య శిబిరం నిర్వహించారు. ఈ వైద్య శిబిరాన్ని బెల్లంపల్లి డిప్యూటీ డీఎంహెచ్ఓ సుధాకర్ నాయక్ ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఇందులో భాగంగా పీఎం జన్మన్ (ప్రధాన్ మంత్రి జన్జటి ఆదివాసి న్యయ మహా అభియాన్) మెడికల్ క్యాంపు నర్సాపూర్ కమ్యూనిటిహాల్ లో నిర్వహించారు. నర్సాపూర్ గ్రామ సర్పంచ్ ప్రభాత రావు, ఉప సర్పంచ్ పర్వతరావు లు వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. ఈ వైద్య శిబిరంలో 56 మంది ప్రజలు స్పెషలిస్ట్ వైద్యుల సేవలను పొందారు. డాక్టర్ ఆదిత్య, పిహెచ్సి వైద్యులు ఏనుగు ఝాన్సీరాణి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. కమ్యూనిటి హెల్త్ ఆఫీసర్ పుట్ట సత్తయ్య, హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ శ్రీనివాస్, హెల్త్ సూపర్వైజర్ రమాదేవి, మిడ్ లెవెల్ హెల్త్ ప్రొవైడర్ ప్రసన్న, సీనియర్ ట్రీట్మెంట్ సూపర్వైజర్ శ్రీపెల్లి శశికాంత్, హెల్త్ అసిస్టెంట్ శ్రీనివాస్, ప్రశాంత్, స్టాఫ్ నర్సు గౌతమి, ఏఎన్ఎంలు పారిజాతం, స్రవంతి, ల్యాబ్ టెక్నీషియన్ కీర్తన, పంచాయతీ సెక్రటరి జగదీశ్, అంగన్వాడీ టీచర్ జమున, సీతాబాయి తదితరులు పాలొన్నారు.

## గర్భా శయ క్యాన్సర్ నివారణకు హెచ్పీవీ టీకా



**ఉద్యమ కెరటం, నేరడిగొండ:** గర్భాశయ క్యాన్సర్ నివారణకు హెచ్పీవీ టీకా వేయడం జరుగుతుందని హెచ్ఈఓ పవార్ రవీందర్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో హెచ్పీవీ వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ నివారణ లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం చేపట్టిన ఈ కార్యక్రమంలో భాగంగా అర్హులైన బాలికలు, మహిళలకు టీకాలు అందజేశారు. మొత్తం 10 మందికి హెచ్పీవీ టీకా విజయవంతంగా వేసినట్లు ఆయన తెలిపారు. అనంతరం మాట్లాడుతూ హెచ్పీవీ టీకా మహిళల ఆరోగ్య రక్షణలో కీలకపాత్ర పోషిస్తుందని, గర్భాశయ క్యాన్సర్ను ముందుగానే నివారించేందుకు ఇది ఎంతో ఉపయోగకరమని పేర్కొన్నారు. ప్రజల్లో అవగాహన పెంచి మరింత మంది అర్హులైన వారు టీకా తీసుకునేలా చర్యలు చేపడుతున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్వైజర్ సంతోష్, ఏఎన్ఎంలు రాణి, గంగామణి, హెల్త్ అసిస్టెంట్లు సాయన్న, శ్రీనివాస్ రెడ్డి, ఆశా వర్కర్లు పుష్పలత, గంగామణి, భానుప్రియ తదితరులు పాల్గొన్నారు.

## రాజీవ్ గాంధీ ఆశయాలు యువతకు స్ఫూర్తి



**ఉద్యమ కెరటం, ఆదిలాబాద్:** రాజీవ్ గాంధీ ఆశయాలు యువతకు స్ఫూర్తిదాయకమని వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బోరంచు శ్రీకాంత్ రెడ్డి అన్నారు. గురువారం ఆదిలాబాద్ పట్టణంలోని డీసీసీ కార్యాలయంలో మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఘన నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దేశ ఆధునీకరణకు, యువత సాధికారతకు రాజీవ్ గాంధీ చేసిన సేవలు చిరస్మరణీయమని కొనియాడారు. సమాచార సాంకేతిక రంగ అభివృద్ధికి ఆయన వేసిన పునాదులే నేటి భారతదేశ పురోగతికి దోహదపడ్డాయని పేర్కొన్నారు. యువత రాజీవ్ గాంధీ ఆశయాలను ఆదర్శంగా తీసుకుని సమాజ అభివృద్ధికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆదివాసీ కాంగ్రెస్ నేషనల్ కోఆర్డినేటర్ కుసుమ్ ఆలం, డీసీసీ అధ్యక్షుడు నరేష్ జాదవ్, మున్సిపల్ చైర్పర్సన్ బండారి అనూష, మాజీ టీపీసీసీ జనరల్ సెక్రటరీ గంద్రత్ సుజాత, నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## వరి కొనుగోలు కేంద్రం వద్ద రైతుల శ్రమ



**ఉద్యమ కెరటం, కాగజ్నగర్:** కొమురంభీం ఆసిఫాబాద్ జిల్లా కౌటాల మండలంలోని ముత్తంపేట్ గ్రామంలో రైతులు వరి ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల వద్ద ఎండబెట్టే పనుల్లో నిమగ్నమయ్యారు. పంట కోత అనంతరం ధాన్యంలో తేమ శాతం తగ్గించి నాణ్యత పెంచేందుకు రైతులు తెల్లవారుజామునే కొనుగోలు కేంద్రాలకు చేరుకొని కర్రల సహాయంతో ధాన్యాన్ని తిరగేస్తూ ఎండబెడుతున్నారు. సరైన విధంగా ఆరబెట్టిన వరి నిల్వ చేయడానికి, విక్రయానికి అనుకూలంగా ఉంటుందని రైతులు తెలిపారు. ప్రస్తుతం వారం రోజులుగా మండుతున్న ఎండలను సైతం లెక్క చేయకుండా రైతులు తమ ధాన్యాన్ని ఎండలో ఆరబెడుతూ కష్టపడుతున్నారు. పంట త్వరగా ఎండిపోతే ఇంటికి తీసుకెళ్లి విక్రయాలు పూర్తి చేయాలని ఆశతో శ్రమిస్తున్నామని పేర్కొన్నారు. వ్యవసాయంపై ఆధారపడి జీవించే రైతుల కష్టం ప్రతి అడుగులో కనిపిస్తోందని గ్రామస్థులు తెలిపారు. ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్నప్పటికీ రైతులు తమ పంట నాణ్యతను కాపాడుకునేందుకు అహర్నిశలు శ్రమించడం గమనార్హమని అన్నారు.

# పోక్సో కేసులో నిందితుడిని కాపాడే ప్రయత్నం జరుగుతోంది

- ఫాస్టాక్ కోర్టు ఏర్పాటు చేసి న్యాయం చేయాలి
- బీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్



**ఉద్యమ కెరటం, కాగజ్నగర్:** తెలంగాణలో శాంతిభద్రతలు రోజురోజుకు క్షీణిస్తున్నాయని, మహిళలు, చిన్నారులపై అఘాయిత్యాలు పెరుగుతున్నాయని బీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ ఆందోళన వ్యక్తం చేశారు. మైనర్ బాలికపై నమోదైన పోక్సో కేసు విషయంలో ప్రభుత్వం, పోలీసులు వ్యవహరిస్తున్న తీరుపై తీవ్ర విమర్శలు చేశారు. గురువారం ప్రెస్మీట్లో మాట్లాడుతూ.. పోక్సో కేసులో నిందితుడిని అరెస్ట్ చేసినట్లు ప్రభుత్వం చెబుతున్నప్పటికీ, అరెస్ట్ సమయంలో పోలీసుల బదులు బీజేపీకి చెందిన న్యాయవాదులు ఎందుకు ఉన్నారని ప్రశ్నించారు. నిజంగా పోలీసులు అరెస్ట్ చేసి ఉంటే, పోలీస్ వాహనంలో తీసుకెళ్లి అధికారిక విధానాల ప్రకారం వ్యవహరించాల్సి ఉందన్నారు. నిందితుడు జైలుకు వెళ్లడానికి కారణం కేవలం బీఆర్ఎస్ పోరాటమేనని, లేకపోతే స్టేషన్ బెయిల్తో బయట తిరిగేవాడని ఆరోపించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, కేంద్ర మంత్రి బండి సంజయ్ ఈ కేసుపై పరస్పర విరుద్ధ వ్యాఖ్యలు చేస్తున్నారని విమర్శించారు. బండి సంజయ్ తన కుమారుడిని తానే సరెండర్ చేయించానని బహిరంగంగా చెబుతుంటే, ప్రభుత్వం మాత్రం పోలీసులు అరెస్ట్ చేశారని చెప్పడం ప్రజలను గందరగోళానికి గురిచేస్తోందన్నారు. నాకాబందీ బందోబస్తు ఏర్పాటు చేసి పట్టుకున్నామని ప్రభుత్వం చెబితే, ఆ సమయంలో విధుల్లో ఉన్న పోలీసుల వివరాలు బయటపెట్టాలని డిమాండ్ చేశారు. బాధితురాలి పేరును బీఆర్ఎస్ బయటపెట్టిందన్న ఆరోపణలను ఖండిస్తూ, బీజేపీ వర్గాలే సోషల్ మీడియాలో ప్రచారం చేశాయని అన్నారు. కేసులో "అదర్స్"గా పేర్కొన్న వారిలో బండి సంజయ్, సంగప్ప, శ్రీరామ్ తదితరుల పేర్లు ఎందుకు చేర్చడం లేదని ప్రశ్నించారు. ఈ కేసులో ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) ఏర్పాటు చేయాలని, ఫాస్ట్రాక్ కోర్టులో విచారణ జరిపి బాధిత బాలికకు త్వరితగతిన న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోషల్ మీడియాలో అసత్య ప్రచారం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. రాష్ట్రంలో ఉన్నత స్థాయి మహిళా అధికారులతో కేసు దర్యాప్తు చేపట్టాలని సూచించారు. బాధితురాలి కుటుంబానికి పూర్తి న్యాయం జరిగే వరకు బీఆర్ఎస్ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు.

# వరి ధాన్యం దిగుమతిలో ఆలస్యం జరగకుండా చూడాలి

**జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**



**ఉద్యమ కెరటం, మంచిర్యాల:** వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా కేటాయించిన రైస్ మిల్లులు, గోదాములకు తరలించిన ధాన్యం దిగుమతి ప్రక్రియలో ఆలస్యం లేకుండా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. గురువారం మందమర్రి మండలం అందుగులపేటలో గల వాసవి రైస్ మిల్ ను జిల్లా పౌరసరఫరాల అధికారి బ్రహ్మారావు, జిల్లా మేనేజర్ శ్రీకళ, మందమర్రి మండల తహశీల్దార్ సతీష్ కుమార్ లతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం రైతుల సంక్షేమం కోసం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి మద్దతు ధర చెల్లి ంచి రైతుల వద్ద నుంచి నిబంధనల ప్రకారం నాణ్యమైన ధాన్యం కొనుగోలు చేస్తుందని తెలిపారు. కొనుగోలు కేంద్రాల నుంచి కొనుగోలు చేసిన ధాన్యాన్ని కేటాయించిన ప్రకారంగా రైస్ మిల్లులకు, గోదాములకు తరలించాలని తెలిపారు. గోదాములకు తరలించిన దిగుమతిలో ఆలస్యం లేకుండా వేగంగా పూర్తి చేయాలని, అవసరం మేరకు హమాలీల సంఖ్యను పెంపొందించుకోవాలని అన్నారు. రైస్ మిల్ల ర్లకు నిర్దేశించిన లక్ష్యాలను త్వరగా పూర్తి చేసే విధంగా కృషి చేయాలని పేర్కొన్నారు. అనంతరం నస్పూర్ మండల కేంద్రంలో గల వ్యవసాయ మార్కెట్ కమిటీ గోదామును జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి, జిల్లా మేనేజర్, నస్పూర్ తహశీల్దార్ సంతోష్ లతో కలిసి సందర్శించారు. కొనుగోలు కేంద్రాల నుంచి తరలించిన ధాన్యాన్ని త్వరగా దిగుమతి చేసుకోవాలని, నిబంధనల ప్రకారం నిల్వ చేయాలని తెలిపారు. నిల్వ చేసిన ధాన్యాన్ని తదుపరి ఆదేశాల ప్రకారం తరలించే విధంగా చర్యలు తీసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# రైతులకు సకాలంలో నగదు చెల్లింపులు పూర్తి చేయాలి

**జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**

**ఉద్యమ కెరటం, మంచిర్యాల:** రైతు సంక్షేమంలో భాగంగా ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి నిబంధనల ప్రకారం కొనుగోలు చేస్తున్న ధాన్యానికి సంబంధించి ఆయా రైతుల ఖాతాల్లో నగదు చెల్లి ంపులు సకాలంలో పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. గురువారం నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలోని జిల్లా పౌరసరఫరాల శాఖ కార్యాలయాన్ని కలెక్టరేట్ పరిపాలన అధికారి పిన్న రాజేశ్వర్, పౌరసరఫరాల శాఖ జిల్లా మేనేజర్ శ్రీకళ లతో కలిసి సందర్శించారు. రైతులకు చేస్తున్న నగదు చెల్లింపు ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నిబంధనల ప్రకారం నాణ్యమైన ధాన్యాన్ని రైతుల వద్ద నుంచి కొనుగోలు చేసి మద్దతు ధర చెల్లిస్తుందని తెలిపారు. ఈ క్రమంలో ధాన్యం విక్రయించిన రైతుల ఖాతాలను నగదు చెల్లింపులు సకాలంలో పూర్తి చేయాలని సూచించారు. కొనుగోలు కేంద్రాల్లో రైతుల వివరాలు రిజిస్టర్లలో స్పష్టంగా నమోదు చేయడంతో పాటు ట్యాబ్ లలో నమోదు చేయాలని ఆదేశించారు. ఆ దిశగా పౌరసరఫరాల శాఖ అధికారులు కొనుగోలు కేంద్రాల నిర్వహకులు, అధికారుల సమన్వయంతో చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.




# ఎగువ మానేరు ప్రమాదంలోనా..?


- వెంటనే రక్షణ చర్యలు చేపట్టాలి: పరిశోధకుడు గుండెల్లి నీలకంఠం హెచ్చరిక
- భారీ వర్షా ల దెబ్బకు దెబ్బతిన్న అప్రాన్
- బ్రిడ్జి పనులు పూర్తి చేయాలని డిమాండ్
- స్థానిక ఎమ్మెల్యే కేటీఆర్ ప్రత్యేక శ్రద్ధ చూపించాలి





**ఉద్యమ కెరటం, గంభీరావుపేట:** ఉమ్మడి కరీంనగర్ జిల్లా, ప్రస్తుతం రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండలంలోని నర్మాల సమీపంలో నిజాం కాలంలో 1946లో నిర్మించబడిన ఎగువ మానేరు ప్రాజెక్టు ప్రస్తుతం రక్షణ చర్యల కోసం ఎదురుచూస్తోందని సాహితీవేత్త, పరిశోధకుడు గుండెల్లి నీలకంఠం ఆందోళన వ్యక్తం చేశారు. ప్రాజెక్టును గురువారం ప్రత్యక్షంగా పరిశీలించిన ఆయన, గత ఏడాది కురిసిన భారీ వర్షాల కారణంగా ప్రాజెక్టు నిర్మాణ భాగాలు తీవ్రంగా దెబ్బతిన్నాయని తెలిపారు. ముఖ్యంగా ప్రాజెక్టులోని అప్రాన్ భాగం కోతకు గురై ప్రమాదకర పరిస్థితులు ఏర్పడుతున్నాయని, తక్షణమే మరమ్మతు పనులు ప్రారంభించకపోతే పరిస్థితి మరింత దిగజారే అవకాశం ఉందని హెచ్చరిం చారు. త్వరలో వర్షాకాలం ప్రారంభం కానున్న నేపథ్యంలో అధికారులు అత్యవసర చర్యలు చేపట్టాలని సూచించారు. అలాగే కొట్టుకుపోయిన బ్రిడ్జి పనులను కూడా వెంటనే పూర్తి చేయాలని నీటిపారుదల శాఖ అధికారులను కోరారు. ఇటీవల అకాల వర్షాల కారణంగా రైతులు, స్థానిక ప్రజలు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారని, ప్రాజెక్టు ప్రాంతంలో ప్రమాదాల సంఖ్య కూడా పెరుగుతోందని పేర్కొన్నారు. ప్రజల ప్రాణాలకు ముప్పు వాటిల్లకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. స్థానిక ఎమ్మెల్యే కేటీఆర్ ప్రత్యేక శ్రద్ధ చూపించి, తెలంగాణకు తలమానికంగా నిలిచిన ఎగువ మానేరు అభివృద్ధి అంశాన్ని ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. అప్రాన్ నిర్మాణం, బ్రిడ్జి పనులు త్వరితగతిన పూర్తి చేయడం ద్వారా ప్రాజెక్టును రక్షించాలని విజ్ఞప్తి చేశారు. తాము రూపొందించిన ప్రత్యేక అభివృద్ధి ప్రణాళికలను నీటిపారుదల శాఖ అధికారులకు అందజేస్తామని గుండెల్లి నీలకంఠం తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ రాజు, దాసరి సాగర్, మధు, గొర్రె కిషోర్, కల్యాణ్, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.





# ఎస్పీఎం కార్మికుల రిలే దీక్షలకు బీఆర్ఎస్ మద్దతు




**ఉద్యమ కెరటం, కాగజ్నగర్:** కాగజ్నగర్లో ఎస్పీఎం కార్మిక సంఘాల జాయింట్ యాక్షన్ కమిటీ (జేఏసీ) ఆధ్వర్యంలో కొనసాగుతున్న రిలే నిరాహార దీక్షలు గురువారం రెండో రోజుకు చేరుకున్నాయి. ఈ దీక్షలకు బీఆర్ఎస్ పార్టీ నాయకులు సంపూర్ణ మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు నక్క మనోహర్, తన్నీరు పోచం మాట్లాడుతూ కార్మికుల న్యాయమైన హక్కులు, ఉద్యోగ భద్రత, పెండింగ్ సమస్యల పరిష్కారం కోసం చేపడుతున్న పోరాటానికి తమ పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని తెలిపారు. గోలేం వెంకటేష్ మాట్లా డుతూ కార్మికులు శాంతియుతంగా చేపడుతున్న ఉద్యమాన్ని ప్రభుత్వం గౌరవించి వెంటనే సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్మికుల ఆవేదనను ప్రభుత్వం గుర్తించి వారి డిమాండ్లపై సానుకూల నిర్ణయం తీసుకోవాలని కోరారు. నిరాహార దీక్షల్లో పాల్గొంటున్న కార్మికులకు నాయకులు ధైర్యం చెప్పి, వారి పోరాటం విజయవంతం కావాలని ఆకాంక్షించారు.

# మాతా శిశు సంక్షేమానికి పెద్ద పీట



**ఉద్యమ కెరటం, నేరడిగొండ:** మాతా శిశు సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని ఆదిలాబాద్ పార్లమెంట్ సభ్యులు గోడం నగేష్ అన్నారు. నేరడిగొండ మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నూతనంగా ఏర్పాటు చేసిన 'మాతా శిశు సంక్షేమ కేంద్రాన్ని' (మదర్ ఫీడింగ్ సెంటర్) ను గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ ఆసుపత్రికి వచ్చే తల్లులకు, పాలిచ్చే తల్లులకు ప్రత్యేక వసతి కల్పించడం ద్వారా సౌకర్యంగా ఉంటుందన్నారు. ఆసుపత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని వైద్య సిబ్బందిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి ఎండి సద్దాం, బిజెపి జిల్లా అధ్యక్షులు, మాజీ జడ్పిటిసి పతంగి బ్రహ్మానందం, బీజేపీ మండల అధ్యక్షులు ఆకుల రాజశేఖర్, జిల్లా కార్యదర్శి గాదె శంకర్, దక్షిణ మధ్య రైల్వే బోర్డ్ మెంబర్ గణేష్ భోసారె, గుడిహత్నూర్ బీజేపీ మండల అధ్యక్షులు శివ, మండల ఉపాధ్యక్షులు అడెపు రమేష్, గూడ రాజేందర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి రాజేశ్వర్, మాజీ సర్పంచ్ కోట్నాక్ కోటేశ్వర్, పలువురు ప్రభుత్వ అధికారులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రతిఒక్కరూ క్రీడా స్ఫూర్తితో ముందుకు సాగాలి

**జిల్లా కలెక్టర్ రాజర్షిషా**






**ఉద్యమ కెరటం, ఆదిలాబాద్:** ప్రతిఒక్కరూ క్రీడా స్ఫూర్తితో ముందుకు సాగాలని జిల్లా కలెక్టర్ రాజర్షిషా అన్నారు. ప్రజాపాలన– ప్రగతి ప్రణాళికలో భాగంగా జిల్లా యువజన క్రీడల శాఖ ఆధ్వర్యంలో ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో జిల్లా స్థాయి స్విమ్మింగ్ పోటీలను గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ క్రీడలు మానసిక ఉల్లాసంతో పాటు శారీరక దృఢత్వాన్ని పెంపొందిస్తాయని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం క్రీడలకు ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని, 'ప్లే, పార్టిసిపేట్'అనే నినాదంతో నిర్వహిస్తున్న ఈ స్పోర్ట్స్ డే స్విమ్మింగ్ పోటీలు అభినందనీయమని పేర్కొన్నారు. విద్యార్థులు, యువత చదువుతో పాటు క్రీడల్లో నూ రాణించాలని సూచించారు. ఓటమిని గెలుపునకు తొలి మెట్టుగా భావించి నిజమైన క్రీడా స్ఫూర్తితో ముందుకు సాగాలని ఉద్బోధించారు. ఆదిలాబాద్ జిల్లాకు చెందిన ప్రతిభావంతులైన క్రీడాకారులకు అన్ని విధాలా సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. స్థానిక క్రీడాకారులు భవిష్యత్తులో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించి జిల్లా ఖ్యాతిని మరింత పెంచాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ బండారి అనూష, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ రాజేశ్వర్, జిల్లా క్రీడల శాఖ అధికారి శ్రీనివాస్, వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు, క్రీడా కోచ్లు , క్రీడాకారులు, వారి తల్లి దండ్రులు పాల్గొన్నారు.

